## సమస్యల పరిష్కారానికి
## ఎల్ఆర్ఎస్ సహాయ కేంద్రం: ఎమ్మెల్యే కసిరెడ్డి


ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌లను ప్రారంభం చేస్తున్న సందర్భంగా పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బ్రహ్మకుమారి కేంద్ర సందర్శన సందర్భంగా బ్రహ్మకుమారి సమాజం వారు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డికి రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. బ్రహ్మకుమారి సమాజం ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభినందించారు. అనంతరం పలు వివాహ వేడుకల్లో, గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఎమ్మెల్యే వెంట కల్వకుర్తి, పట్టణ, వివిధ మండలాల ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు. అదే విధంగా మైసిగండి మైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. మైసిగండి గ్రామంలో బోనాల సంబురాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయన వెంట జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు పలువురు సభ్యులు ఉన్నారు.

మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# ఎల్ఆర్ఎస్‌పై సర్కార్ ఫోకస్..

- క్షేత్ర స్థాయిలో ప్రక్రియ షురూ..
- మున్సిపాలిటీల్లో ప్రారంభమైన వెరిఫికేషన్
- ఉమ్మడి జిల్లాలోని 19మున్సిపాలిటీలు
- ఎల్ఆర్ఎస్ కింద 1,94,476 దరఖాస్తులు
- ఇప్పటికి రూ.2.10కోట్ల ఆదాయం
- ఇప్పటికే 1196 దరఖాస్తులు తిరస్కరణ
- క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పరిశీలన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 28, ప్రభాతవార్త:** అనుమతి లేకుండా లే అవుట్లు చేసిన కారణంగా ఇండ్ల నిర్మాణాలకు, ప్లాట్ల అనుమతులకు ఇబ్బందులు పడుతున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎల్ఆర్ఆర్ లే అవుట్ల క్రమబద్ధీకరణపై గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు. క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈమేరకు రానున్న మూడు నెలల్లో వంద శాతం దరఖాస్తులను వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారికి ఈ అవకాశం లభించనున్నది. ఈ


ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రక్రియ పూర్తయితే గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు భారీగా ఆదాయం కూడా సమకూరనున్నది. లేఅవుట్లు లేని ప్లాట్ల కొనుగోలు చేసిన లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి నానా ఇబ్బందులు -మిగతా4లో..

**జిల్లాల వారీగా మున్సిపాలిటీల ఆదాయం**

| జిల్లా | ఆదాయం(రూ) |
|---|---|
| మహబూబ్‌నగర్ | 94,28,624 |
| వనపర్తి | 7,36,172 |
| నాగర్‌కర్నూల్ | 57,69,883 |
| నారాయణపేట | 15,49,912 |
| గద్వాల | 35,62,663 |

**ఎల్ఆర్ఎస్ కింద గతంలో దరఖాస్తులు**

| మున్సిపాలిటీ | దరఖాస్తులు |
|---|---|
| భూత్పూర్ | 5999 |
| మహబూబ్‌నగర్ | 31144 |
| జడ్చర్ల | 17564 |
| అమరచింత | 438 |
| ఆత్మకూరు | 3788 |
| కొత్తకోట | 7539 |
| పెబ్బేరు | 7261 |
| వనపర్తి | 28941 |
| కల్వకుర్తి | 11443 |
| కొల్లాపూర్ | 4565 |
| నాగర్‌కర్నూల్ | 16011 |
| అచ్చంపేట | 11975 |
| అలంపూర్ | 425 |
| గద్వాల | 14317 |
| అయిజ | 9767 |
| వడ్డేపల్లి | 1930 |
| కోస్గి | 3909 |
| మక్తల్ | 10498 |
| నారాయణపేట | 6962 |
| మొత్తం | 1,94,476 |

## అమ్మ ఆదర్శ పాఠశాల
## పనులపై కలెక్టర్ సమీక్ష

**పాఠశాల పనులు బిల్లుల కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలి**

**జిల్లాలో మొత్తం 333 పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం**

**పనులు ప్రారంభించాం: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 28 ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తి అయిన వాటికి బిల్లు పేమెంట్ కొరకు ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 333 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు ప్రారంభించి దాదాపు అన్ని పూర్తి అయ్యాయని వాటికి సంబంధించిన బిల్లు చెల్లించేందుకు యం.బి లు ఇవ్వాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా చిన్న చిన్న పనులు ఎక్కడైనా పెండింగ్ ఉంటే వారంలో పూర్తి చేయాలని సూచించారు. బిల్లులు ఇచ్చేటప్పుడు ప్రధానోపాధ్యాయుడు, స్కూల్ కమిటీ సంతకంతో పాటు నాడు నేడు ఫోటోలు జతపర్చాలని సూచించారు. సెప్టెంబర్ 5 లోపల బిల్లులు పేమెంట్ ప్రక్రియ పూర్తి అయ్యేవిధంగ చూడాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, పంచాయతీరాజ్ ఈ ఈ మల్లయ్య, రోడ్ల భవనాల శాఖ కార్యనిర్వహక ఇంజనీరు దేశ్య నాయక్, టీఎస్ ఈడబ్ల్యూఐ డిసి కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, డి ఈ లు, ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## 45గేట్లు ఎత్తి దిగువకు..

- జూరాలకు పోటెత్తిన వరద
- 3,03,824 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదు
- మళ్లీ తెరుచుకున్న శ్రీశైలం డ్యాం గేట్లు


జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 28, ప్రభాతవార్త :** కర్ణాటక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పెరిగింది. కర్ణాటలోని ఎగున నుంచి జూరాల డ్యాంకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. బుధవారం జూరాలకు సాయంత్రం 6గంటల వరకు అందిన సమాచారం మేరకు 2,44,000 క్యూసెక్కుల వరద చేరగా 45గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 2,86,740క్యూసెక్కులు దిగువకు వదిలారు. పవర్ హౌజ్ ద్వారా 14వేల892క్యూసెక్కులు వదిలారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు - మిగతా4లో..

## మహిళా శక్తితో ఆర్థిక స్వావలంబన..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా మహిళా శక్తి ద్వారా కృషి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దేవ సహాయం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చిన్న ఓబులేష్‌తో కలిసి జిల్లా అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సీడీపీఓలు, ఎంపీఎంలతో మహిళా శక్తి పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా అనేక అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలని తెలిపారు. మహిళలను ఆర్థికంగా మరింత ప్రగతి బాటలో పయనింపజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మహిళా శక్తి పథకంలో మైక్రో ఎంటర్ ప్రైజెస్ విభాగంలోని విభాగంలో అనుభవం ఉన్న మహిళలను పారిశ్రామిక రంగంలో రాణించేలా శిక్షణ అందించడంతో పాటు వారికి అవసరమైన జిల్లా యంత్రాంగం పూర్తిగా అండగా ఉంటుందని తెలిపారు. స్వయం సహాయక మహిళా సంఘాలు సమిష్టిగా కృషి చేస్తూ జిల్లాలో ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందిస్తూ క్యాంటీన్ రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. అదే విధంగా


నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు 14 రకాల రంగాల వ్యాపారాల్లో అభివృద్ధి సాధించే దిశగా అధికార యంత్రాంగం మహిళల ఎంపికతో పాటు వారికి తోడ్పాటు అందించే దిశగా అధికారులకు కృషి

**మహిళలు పారిశ్రామికంగా, ఆర్థికంగా రాణించే**

**దిశగా మహిళ శక్తి ద్వారా కృషి....**

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

చేయాలని కలెక్టర్ సందర్భంగా ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు వారు ఎంచుకున్న రంగాల్లో ఆర్థికంగా ఉందని తెలిపారు. అందుకు వారికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మహిళా సంఘాలకు ప్రొత్సాహం అందించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికంగా అభ్యున్నతికి కృషి చేసేందుకే ఈ పథకం ద్వారా బ్యాంక్ రుణాలను అందించేందుకు చర్యలు తీసుకున్నదని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు సైతం మహిళా శక్తి కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, తమ అభిరుచికి తగిన యూనిట్లను ఎంచుకొని వ్యాపార దక్షత, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మొదటి విడత లబ్దిదారులు విజయవంతంగా యూనిట్లను నడపగలిగితే వారిని స్ఫూర్తిగా తీసుకొని మహిళా మహిళా సభ్యులు కూడా ఉత్సాహంగా ముందుకు వస్తారన్నారు. ఒకే రకమైన యూనిట్లను కాకుండా, మార్కెట్ డిమాండ్, తమ తమ నైపుణ్య అభిరుచికి అనుగుణంగా యూనిట్లను ఎంచుకొని పూర్తి శక్తి సామర్థ్యాలతో నిర్వహించి ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. అభివృద్ధి చేందేందుకు జిల్లా యంత్రాంగం అందుకు పూర్తిగా సంసిద్ధంగా పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు, డీఆర్డీఏ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ స్వయం సహాయక మహిళా సంఘాల నాయకులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**ఉత్సవ కమిటి సభ్యులు,**

**పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలి**

**శాంతి కమిటీ సమావేశంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు**


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**జడ్చర్ల, ఆగష్టు 28 ప్రభాతవార్త :** వచ్చే నెలలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల ప్రతిష్టాపన, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. జడ్చర్లలోని పోలీస్ స్టేషన్‌లో వివిధ పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జడ్చర్ల సిఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం శాంతి కమిటీ సమావేశాలు జరిపించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో విగ్రహాల ప్రతిష్ట అయిన రోజు నుండి నవరాత్రుల సమయంలో అలాగే నిమజ్జనం - మిగతా4లో..

### రుణమాఫీ పొందిన రైతులకు..
# కొత్త రుణాలు ఇవ్వాలి

**మహిళా శక్తి పథకం కింద యూనిట్లు**

**అన్నింటిని గ్రౌండ్ చేయాలి**

**బ్యాంకుల అనుసంధానంతో అమలు**

**చేసే అన్ని పథకాల అమలుకు బ్యాంకర్లు**

**పూర్తి సహకారం అందించాలి**

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు 28 ప్రభాత వార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు పంట రుణమాఫీలో భాగంగా రుణమాఫీ పొందిన రైతులందరికి కొత్త రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. బుధవారం ఆమె సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏదైనా సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతుల సమస్యను పరిష్కరించడం అలాగే ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు పొరపాట్లున్నట్లయితే సరైన ధృవపత్రాలను తీసుకుని వాటిని సవరించి వారందరికి రుణమాఫీ వచ్చేలా చూడాలన్నారు. ముఖ్యంగా రుణమాఫీ పొందిన రైతులందరికి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. రుణమాఫీకి సంబంధించి రైతుల నుండి ఫిర్యాదులను స్వీకరించే నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇదివరకే 08542,241165 ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. సైబర్ క్రైమ్ నియంత్రణలో భాగంగా బ్యాంకులు తగిన పాత్ర పోషించాలని, ఎవరైనా సైబర్ క్రైమ్‌లో మోసపోయినట్లయితే వారు తిరిగి వారి డబ్బులను ఎలా పొందాలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇందుకుగాను అన్ని నోటీసు బోర్డులలో అవసరమైన సమాచారాన్ని ఉంచాలని చెప్పారు. అంతేగాక ఎవరైనా ప్రజలు సైబర్ క్రైమ్ మోసానికి గురైనట్లయితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. మహిళా శక్తి పథకం కింద లబ్దిదారులకు వీలైనంత త్వరగా రుణాలు అందించాలన్నారు. అలాగే ఆర్‌శెట్టి కింద శిక్షణ పొందిన యువతకు సైతం రుణాలు ఇవ్వాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి పథకాల కింద నమోదయ్యే వారి శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ బ్యాంకర్లతో కోరారు. ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్, పిఎం ఈజీపి కింద పెండింగ్‌లో ఉన్న రుణాలన్నింటిని సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయాలని ఆమె తెలిపారు.బ్యాంకుల అనుసంధానంతో అమలు చేసే అన్ని పథకాల కింద లబ్దిదారులకు జాప్యం లేకుండా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లతో కోరారు. స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్. ఎల్‌డిఎం భాస్కర్, డిఆర్‌డిఓ నరసింహులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, ఎస్సీ సంక్షేమ అధికారి విష్ణువర్ధన్, ఐఓబి రీజినల్ మేనేజర్ చంద్రబోస్, ఆర్సెట్టి డైరెక్టర్ శ్రీనివాస్, ఏజీఎం బాలసుబ్రమణ్యం, ఏపిజీవీబీ గోపాల్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మురళీకృష్ణ, ఆర్బీఐ ఏజీఎం దేవజిత్ బారు, నాబార్డు డిడిఎం షణ్ముఖచారి సమావేశానికి హాజరయ్యారు.

### పామిరెడ్డి పల్లిలో
## ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సు ఢీ కొని ఇద్దరు యువకులు మృతి**

**న్యాయం చేయాలంటూ రోడ్డుపై**

**మూడు గంటల పాటు గ్రామస్థులు రాస్తారోకో**

**వనపర్తి ఆగష్టు 28 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డి పల్లి గ్రామంలో విషాదం నెలకొంది. బుధవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో పండగపూట మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అరణ్య రోదనలు మిన్నంటాయి. మృత్యువు రూపంలో దూసుకు వచ్చిన ఆర్టీసి బస్సు ఢీకొని గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... వనపర్తి డిపోకి చెందిన టీఎస్ 32 టి 5577 ఆర్టీసి బస్సు వనపర్తి నుండి ఘణపురం మీదుగా మహబూబ్‌నగర్ వెళ్తుండగా ఈ క్రమంలో పామిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన బోయ అశోక్, బోయ చందు టీఎస్ 07 ఈఎఫ్ 4528 ద్విచక్ర వాహనంపై వనపర్తికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. దీనితో గ్రామ ప్రజలు యువకులు కుటుంబ సభ్యులు రోడ్డు పై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. వెంటనే వనపర్తి డిఎస్పి కొత్తకోట సిఐ పెద్దమందడి ఎస్సై పోలీస్ బృందం హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. దాదాపు నాలుగు గంటలపైన రాస్తారోకో నిర్వహించారు. మృతుని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రభుత్వం నుండి మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి సంఘటన స్థలానికి - మిగతా4లో..


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు

## స్టాఫ్‌నర్సు పోస్ట్‌కు దరఖాస్తు చేసుకోండి..

**మెడికల్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్, వెల్లడి**

**గద్వాల, ఆగస్టు 28 ప్రభాతవార్త:** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో టి ఎస్ఎసిఎస్ భాగం నందు 1 పి.పి.టి.సి.టి స్టాఫ్ నర్సు 1 పోస్టు కొరకు అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పి.పి.టి.సి.టి పోస్ట్ కు సంబంధించి సైకాలజీ సోషల్ వర్క్ సోషియాలజీ ఆంథ్రోపాలజీ హ్యూమన్ డెవలప్మెంట్ నర్సింగ్ గ్రాడ్యుయేట్ డిగ్రీ హోల్డర్, నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కింద కౌన్సిలింగ్ విద్యలో ఒక సంవత్సరం అర్హత, జాతీయ ఎయిడ్స్,ఎస్ టి టి కంట్రోల్ ప్రోగ్రం (ఎన్ఏసిపి) సౌకర్యం కింద పనిచేసిన అనుభవం లేదా కమ్యూనిటీ సెట్టింగ్స్ అనుభవం ఉండి, 21 నుండి 45 సంవత్సరాల వయసుగల వారు అర్హులని తెలిపారు. స్టాఫ్ నర్స్ పోస్ట్ కు జి ఎన్ ఎమ్ లేదా బిఎస్సి నర్సింగ్ తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం గలవారై, 21 నుండి 45 సంవత్సరంలో వయసు గలవారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వారి యొక్క రెస్యూమ్స్ ను పత్రిక ప్రకటన నుంచి ఒక వారంలోపు మెడికల్ సూపరింటెండెంట్ కు ఆఫీస్ పనివేళలో ఉదయం 10:30గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించగలరని తెలియజేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామస్తులు

**కల్వకుర్తిరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన వెంకట్ నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లెల్ల గ్రామ మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులు గణేష్, కిశోర్‌లతో పాటు పలువురు నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల నరేష్, నరేష్, చిక్కొండ ఆంజనేయులు, నాప శివ, చిక్కొండ వెంకటయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## నెలాఖరులోగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి పరీక్షలు నిర్వహించాలి: ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న దుంకుడు శ్రీనివాస్

**మహబూబ్‌నగర్,ఆగష్టు28 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలను అకాడమి మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో సంబందింత కాంప్లెక్స్ హెచ్ఎంకు, ఎంఈఓకు సమాచారం ఇచ్చి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులలో మాట్లాడుతూ తరగతి వారి లెర్నింగ్ అవుట్ కమ్స్‌ను పరిశీలించారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలోనూ ఆగస్టు 31లోపు ఎఫ్ఎల్ఎన్,ఎల్ఐపి బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి విద్యార్థుల వారిగా ఫలితాలు నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా భవిష్యత్తులో నిర్వహించబోయే ఎన్ఎఎస్ సర్వేకు సంబంధించి విద్యార్థులను సంసిద్ధులను చేయాల్సిందిగా ఉపాధ్యాయులను కోరారు.

## నేడు అమరచింతకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాక



**అమరచింత ఆగష్టు 28 ప్రభాతవార్త :** అమరచింత మండల తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తో పాటు పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ హాజరవుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు తహశీల్దార్ కార్యాలయంలో షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మీ సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధి పొందిన వారు హాజరుకావాలని కోరారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని వారు తెలిపారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



అంత్యక్రియలకు ఆర్థికసాయం చేస్తున్న సంస్థ సభ్యులు

**కొత్తకోట ఆగష్టు 28 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణం ఆరో వార్డుకు చెందిన జయమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న జెఎస్ రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సుభాష్, సుజ్ఞానం, జయరాజు, యాకోబు, నాగరాజు, మన్యం, షీమీయాసోన్, శాంతిరాజు, రత్నం, చంద్రబాబు జెఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె దయానంద రాజు, జె సతీష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ పునః నిర్మాణ గడప ప్రతిష్ట



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**పెబ్బేర్ ఆగష్టు 28 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలో సంస్థాన కాలంలో నిర్మించిన శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయం శిథిలావస్థకు చేరుకున్నందున గ్రామస్తుల నిర్ణయం మేరకు పునఃనిర్మాణం చేపట్టిన సందర్బాన గడప (దర్వాద) ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. పూజారులు కౌడిణ్య, మధుసూదన్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న బునాదిపూర్ గ్రామస్తుడు ప్రవీణ్ టీచర్ వారి పుత్రిక చేతుల మీదుగా గుడి నిర్మాణం కోసం తన స్థోమతకు తగ్గ నగదును విరాళంగా అందించడం జరిగిందని మా గ్రామ స్తులతో పాటు, వివిధ గ్రామాలకు సంబంధించిన భక్తులు, హిందూ బంధువులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై నగదు, వస్తు, రూపేణ విరివిగా విరాళాలు అందించి శ్రీ వీరభద్ర స్వామి వారి కృప కటాక్షాలు పొందాలని శ్రీహరి సేవకులు సితార వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.పూజ కార్యక్ర మాల్లో ఆలయ కమిటీ సభ్యులు, జయన్న శెట్టి, మాధవుడు, వెంకటేష్ సాగర్, రాములు, అయ్య లు, గోపాల్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, వేణుగోపాల్, మేస్త్రి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసరాల సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కోయిల్‌కొండ,ఆగష్టు 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కనాయపల్లి గ్రామంలో బుధవారం గుంజు స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు పెరికివీడు రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు నిత్యావసర సరుకులు, బెడ్‌షీట్లను, ప్లేట్లు, గ్లాసులు తదితర సామాగ్రిని అందించడం జరిగింది. ఈ సందర్భంగా గుంజు స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ మండలంలోని నిరుపేద ప్రజలందరికి మా స్వచ్ఛంద సంస్థ ద్వారా కావలసిన వస్తువులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద ప్రజలకు వైద్య సేవలు సైతం అందించడం జరుగుతుందన్నారు. గుంజు స్వచ్ఛంద సంస్థ ద్వారా మండలంలో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గుంజు స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అంకిళ్ల సంపత్‌కుమార్, సభ్యులు పసుల కేశవులు, పసుల కృష్ణ, రాజు,రవి, ఆంజనేయులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం...

**- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** పేద, బడుగు బలహీన వర్గాలకు కూడా కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాశ్వత పథకాలను ప్రవేశ పెట్టడం వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయడం ఒక కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడం జరుగుతుందని, ఇప్పటికే అనేక గ్యారెంటీలకు బడ్జెట్‌లో నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను దుర్వినియోగం చేసుకోకుండా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సునేంద్ర, శ్రీను, జక్క రాజు, బచ్చన్నయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ నిర్మల, కొండ నాగేష్, మాజీ ఎంపీటీసీ రమణారావు తదితరులు ఉన్నారు.

### రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సింగిల్‌విండో కార్యాలయాలకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం



సింగిల్‌విండో కార్యాలయ భవన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని తాడూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సింగిల్‌విండో కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, పాలక మండలిలు కూడా రైతులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి



అమరచింతలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

**అమరచింత ఆగష్టు 28 ప్రభాతవార్త :** విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా పోరాడి పోలీస్ కాల్పుల్లో మరణించిన విష్ణు వర్ధన్, బాలస్వామి ,కామిరెడ్డి ,రామకృష్ణ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి జిఎస్ గోపి ,బి వెంకటేష్ ,ఆర్ఎన్ రమేష్, ఎస్ అజయ్ అన్నారు. హైదరాబాదులో బషీరాబాగులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జరిగిన విద్యుత్ అమరవీరుల వర్ధంతి బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో అమరవీరులకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపు కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని శాంతియుతంగా ధర్నా చేస్తుంటే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై గుర్రాలతో తొక్కించి లాటి చార్జి పోలీస్ కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు వదిలారని వారన్నారు. పాలక ప్రభుత్వాలు విద్యుత్తు చార్జీలు పెంపు ఆలోచన వస్తే విద్యుత్ పోరాటం గుర్తు చేసుకోవాలని వారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ప్రజల సిపిఎం పార్టీ అండగా ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చన్న,శ్యాంసుందర్, రాఘవేంద్ర, తిరుమల, శ్రీను, రాము, వెంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గొలుసుకట్టు చెరువులను నింపాలి: కొత్త రవిందర్‌రావు



జప్తి సదగోడులో నీరు నిండని గొలుసుకట్టు చెరువు

**ఉప్పునుంతల,ఆగష్టు 28 ప్రభాతవార్త :** కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద కాలువల ద్వారా వస్తున్న నీటితో గొలుసుకట్టు చెరువులను నింపాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవిందర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. కేఎల్ఐ నీటిపై ఆశలు పెట్టుకుని ఈ ప్రాంత రైతాంగం పెద్ద ఎత్తున వరిసాగు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలో ఉన్న గొలుసుకట్టు చెరువులను నీటితో నింపడం వల్ల ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పండుతాయని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆయా పరిసర గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. గత సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ జలకళతో తొణికిసలాడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆ రైతాంగాన్ని ఆదుకోవడానికి ఆయా గ్రామాల చెరువులను నింపాలని కోరారు. మండల పరిధిలోని లక్ష్మాపురం, వెంకటేశ్వర చెరువు 10 గ్రామాల పరిధిలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా భూగర్భ జలాల పెంపునకు తోడ్పడే ఇలాంటి చెరువును నీటితో నింపి సాగుకు సహకరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కెఎల్ఐ కాలువలకు నీటిని విడుదల చేసి రోజులు గడుస్తున్నా చెరువుల పరిస్థితి యదాతథంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి గొలుసుకట్టు చెరువులను నీటితో నింపేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## మురుగు తొలిగించాలంటూ కమిషనర్‌కు వినతి ...



ఉర్దూ మీడియం ఆవరణలో పేరుకుపోయిన మురికి నీరు

**ఆత్మకూర్ ఆగష్టు 28 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల ఆవరణలో నెలకొన్న మురుగునీటిని తొలగించాలంటూ కాలనీకి చెందిన పలువురు యువకులు, బుధవారం రోజు ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ తో కలిసి వినతి పత్రం సమర్పించారు. గడచిన నెల రోజులుగా ఉర్దూ మీడియం పాఠశాల ఆవరణలో మురుగునీరు చేరి కాలనీవాసులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతన్నారని ఈ విషయంపై పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకున్న స్పందించడం లేదని వారు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్లో కాలనీ లోని మురుగునీరు చేరడమే కాకుండా వర్షపు నీరు చేరి మొత్తం దుర్గంధ భరితంగా మారి అనారోగ్యాలకు గురవుతున్నామని వారు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుంబా ఉర్దూ మీడియం పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు కూడా దుర్గంధ భరితమైన వాతావరణంలో అనారోగ్యాలకు గురవుతున్న విషయాన్ని మున్సిపల్ కమిషనర్ గుర్తించి తక్షణమే మురుగునీటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కనీసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఉర్దూ మీడియం పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టి పరిశుభ్రతను పెంచి పోషించాలని వారు కోరారు. మున్సిపల్ కమిషనర్ ను కలిసిన వారిలో జుబేర్, మునీర్, ఫీరోజ్, శాలం తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ రుణ మాఫీ వర్తింపచేయాలి...

**జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు తెలంగాణ రైతాంగ సమితి వినతి...**



రైతుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన రైతాంగ నాయకులు

**ఇటిక్యాల ఆగష్టు 28 ప్రభాతవార్త :** జిల్లా ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయినా జూరాల ప్రాజెక్టు లో 4 టిఎంసి మట్టిని పూడిక తీత పనులు చేపట్టాలని షట్టర్లు క్రాస్ డ్రాప్టును మరమత్తులు చేయాలని రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని తెలంగాణ రైతాంగ సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి రైతాంగ సమితి కమిటీ నాయకులు రైతులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2021 అక్టోబర్ లో మూడు వ్యవసాయ నల్లా చట్టాలను రద్దు చేస్తూ వ్రాతపూర్వక హామి ఇచ్చి నేటికి ఈ హామీ నెరవెర్చలేదని, కనీస మద్దతు ధర చట్టం చెయ్యాలనీ, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని, తెలంగాణలోని రైతులందరినీ పంట రుణ మాఫీ చేయాలని అర్హులైన రైతులకు 2 లక్షల రుణమాఫీ చెయ్యాలని అలాగే కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా అందించాలని భూ సమస్యలను పరిష్కరించి రైతులందరికి న్యాయం చేయాలని తెలంగాణా రైతాంగ సమితి ఆధ్వర్యంలో నాయకులు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్, జిల్లా అధ్యక్షులు ఖాజ మహిమెద్దిన్, జిల్లా ఉపాధ్యక్షులు రాజన్న, మల్దకల్ మండల నాయకులు మార్కు, కె మహేష్, పౌర హక్కుల సంఘం నాయకులు, రైతులు రాముడు, భాస్కర్, డాక్టర్ ప్రేమ్ కుమార్, కో అప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారికి రైతు కూలీ సంఘం నాయకుల వినతి



వ్యవసాయాధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,ఆగష్టు 28 ప్రభాతవార్త :** నిబంధనలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని కోరుతూ బుధవారం అచలభారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దామరగిద్ద మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి హరితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ అచల భారత ప్రగతిశీల రైతు సంఘం దామరగిద్ద మండల కమిటి అధ్యక్షుడు పెద్దింటి తాయప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ పట్టాపాస్ పుస్తకంపై ఉన్న బ్యాంకు రుణాలు మాఫీ చేస్తానని వాగ్దానం చేశారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌కార్డు ప్రాతిపదికన కుటుంబం మొత్తం కలిపి రెండు లక్షల వరకు రుణం మాఫీ చేస్తామని చెబుతున్నారు. ఇందులో సగం మంది కూడా రైతులు లబ్ది పొందలేదన్నారు. వివిధ కారణాల వల్ల రుణమాఫీ కాలేదన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కుట్ర పూరితంగానే రైతులను రుణమాఫీకి దూరం చేస్తుందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలన్నారు. పట్టా పాస్‌బుక్ ప్రాతిపదికన రుణాలు మాఫీ చేయాలని అచల భారత ప్రగతిశీల రైతు సంఘం డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు పి. మధు, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు బాలరాజ్, అజయ్, బి.రాజు, బాపన్‌పల్లి నారాయణమ్మ, ఉల్లిగుండం గుంతల కవితతో పాటు రైతులు ఉన్నారు.

## చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



బాధితులకు చెక్‌ను అందజేస్తున్నా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాలటౌన్ ఆగష్టు 28, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండలం పరిధిలోని అరగిద్ద గ్రామానికి చెందిన జయమ్మ భర్త శ్రీనివాసులు కు 60000, రూపాయలు చెక్కులను చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్,మాజీ జెడ్పిటీసీ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి, కృష్ణ గౌడ్, చిన్న గోవిందు, సెడ్రిక్, ఆంజనేయులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి: ఎస్సై భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్సై భాస్కర్‌రెడ్డి

**కోయిల్‌కొండ,ఆగష్టు 28 ప్రభాతవార్త :** గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్సై భాస్కర్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన కోయిల్ కొండలోని పోలీస్ స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గణేష్ ఉత్సవ నిర్వాహకులు, గ్రామస్తులు హాజరయ్యారు. గణేష్ విగ్రహాలను అనుకున్న సమయానికల్లా నిమజ్జనానికి తరలించాలని ఎస్సై సూచించారు.పండగలను సోదర భావంతో నిర్వహించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బి.కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి. రవిందర్, మాజీ ఎంపిపి వై. మహెందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై. విద్యాసాగర్‌గౌడ్, నాయకులు వేముల జగన్‌గౌడ్, పిట్లశేఖర్, ఎం.రామస్వామి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఓ అధికారికి సన్మానం



కొరటికల్ క్లస్టర్ ఏఈఓను సన్మానిస్తున్న వెల్టూరు గ్రామస్తులు

**ఉప్పునుంతల,ఆగష్టు 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొరటికల్ వ్యవసాయ క్లస్టర్ మండల వ్యవసాయ విస్తీర్ణాధికారిగా చిన్యానాయక్ విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలో గతంలో ఇక్కడ పనిచేసిన భరత్‌కుమార్ బదిలీ పై వెళ్లారు. ఆయన స్థానంలో చిన్యానాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా క్లస్టర్ పరిధిలోని రైతులందరికీ మెరుగైన సేవలందించేందుకు అందుబాటులో ఉంటానని ఏఈఓ తెలిపారు.కార్యక్రమంలో భూషిరాజు మల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్, గుద్దటి బాలరాజు, ఉప్పరి బాలరాజు, లింగమయ్యగౌడ్, రాగి భాస్కర్‌రెడ్డి,విజయ్‌రెడ్డి,సత్యనారాయణ, నరెందర్ పాల్గొన్నారు.

## యువత నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి




యువతీ యువకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్,ఆగష్టు 28 ప్రభాతవార్త :** పట్టణ కేంద్రంలోని అయ్యప్ప డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ విద్యార్థులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారిత కేంద్ర ఆధ్వ ర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాలు పెంపుదల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్ర ఆర్థిక నిపుణులు విజయ్ కుమార్ మా ట్లాడుతూ భారత ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలన కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి పిఎంకెవివై పథకం గురించి నైపుణ్యాల పెంపుదలపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పిం చారు. స్వయం ఉపాధి పథకాలు, ముద్ర యోజన పథకాల గురించి చర్చించారు. 181 టోల్‌ఫ్రీ నంబర్ సఖీ కేంద్రం 1098 వికలాంగుల శాఖ గురించి అన్ని విభాగాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిస్టు అనిత, మెంటర్ రేణుకా, అయ్యప్ప డిగ్రీ కాలేజీ స్టాఫ్ అనంతరెడ్డి, లెక్చరర్స్, నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

# బాలికలు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

◆ జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యులు సయ్యద్ సహజాది

◆ విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకన్నా మైనారిటీ కమిషన్

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 28 ప్రభాతవార్త:** అమ్మాయిలు లక్ష్యంతో చదువుకొని ఒకరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై నిలబడాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యులు సయ్యద్ సహజాది ఉద్బోధించారు. బుధవారం నాడు వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా ఉదయం పట్టణంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు పరిశీలించి విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదని, ఏ సమస్య వచ్చిన ఇంకొకరిపై ఆధారపడకుండా ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఉద్బోధించారు. అది పాఠశాల నుండే ప్రారంభం కావాలని,



పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతున్న మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ సహజాది



కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ బాలికలు

ఏమైన సమస్యలు ఉంటే ధైర్యంగా ప్రశ్నించాలని సూచించారు. అందుకు తన జీవిత అనుభవాలను ఉదాహరణగా తెలియజేశారు. తాను నిరుపేద కుటుంబం నుండి వచ్చానని, మహిళల హక్కులు, మహిళా సాధికారత కొరకు కృషి చేయడం జరుగుతుందన్నారు. మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల భవనం శిధిలావస్థలో ఉందని సాధ్యమైనంత త్వరగా ఇక్కడి నుండి మార్చాల్సిన అవసరం ఉందని ఆర్.ఎల్.సి కిరణ్మయిని ఆదేశించారు.

**మైనార్టీ డిగ్రీ కాలేజ్ కొరకు వినతి పత్రం:** మైనార్టీ బాలికల కోసం ప్రత్యేకంగా డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయడం కొరకు మైనార్టీ కాలేజి ఇన్చార్జి ప్రిన్సిపాల్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది, డిగ్రీ కాలేజీ రావడంతో వందలా మంది బాలికలు చదువుకోవడానికి వెసులుబాటు ఉంటుంది, గ్రామీణ ప్రాంతం నుండి వచ్చే విద్యార్థులు ఆర్థిక స్థితులు అంతంతగా ఉంటున్నాయి వారిని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కళా మంజూరు చేయాలని వారు తెలిపారు, మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ సహజాది మాట్లాడుతూ స్టేట్ గవర్నమెంట్ కు సెంట్రల్ గవర్నమెంటుకు మంజూరు కోసం ఒక రిప్రజెంటేషన్ పంపిస్తానని వారు తెలిపారు, అలాగే మైనార్టీ కాలేజిలో పనిచేసే స్కాం ఇంజేర్స్, ఎలక్ట్రిషన్స్, ఉద్యోగ భద్ర కల్పించాలి వారు మైనార్టీ కమిషన్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది వారు సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగులను తీసి ఆలోచన ప్రభుత్వాన్ని గాని సెంట్రల్ గవర్నమెంట్ గానీ ఇప్పటివరకు ఎలాంటి ఆలోచన రాలేదు మీకు ఏమైనా అనుమానాలు ఉంటే మా దృష్టికి తీసుకురాండి అని వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పద్మావతి, డిఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్.ఎల్.సి కిరణ్మాయి, ప్రిన్సిపాల్ సౌమ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హవిల రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో కలిసి అల్పాహారం తింటున్న మైనార్టీ కమిషన్ సభ్యులు

## కాట్రేవుపల్లి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టండి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**మక్తల్,ఆగష్టు 28 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణ సమీపంలోని దండు నుంచి కాట్రేవుపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని మక్తల్ పట్టణంతో పాటు దండు కాట్రేవుపల్లి, ఎర్నాగన్‌పల్లి, రుద్రసముద్రం, మంతన్‌గోడు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మక్తల్ తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల రైతులు తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. రోడ్డుకు ఇరువైపులా పదుల సంఖ్యలో ఇటుక బట్టీలను అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడంతో భారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్డు పూర్తిగాఅధ్వానంగా తయారైం దన్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని లేనిచో తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని రైతులు అన్నారు. అనంతరం తహసి ల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోతిరుపతి, చిన్ననర్సింహులు, ఎం. నర్సింహులు, రాములు, మద్దిలేటి, రామ్‌మాధవ్, చంద్రశేఖర్, తిరుపతి, వెంకటేష్, కథలప్ప, రాజు, తిరుపతి,వెంకటప్ప, అంజప్ప,బండారిశివరాజ్, చిన్న నర్సింహులు,గోపాల్‌గౌడ్, తెలుగు రాయప్ప,రసూల్,నారాయణ,తిరుపతి,చిన్నలింగప్ప,మహదేవ్,గోపి, చెన్నప్ప,నక్క కిష్టప్ప,స్వామి, వెంకటప్ప, తిరుపతి, రమేష్, తిరుపతి కిష్టప్ప, గోపన్న, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## యజ్ఞం యాగాలతోనే ముక్తికి మార్గం

■ ఆర్యసమాజ్ ప్రతినిధి సభ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు విఠల్‌రావుఆర్య



యజ్ఞం నిర్వహించిన దృశ్యం

**నారాయణపేట టౌన్,ఆగష్టు 28 ప్రభాతవార్త:** యజ్ఞం యాగాలు చేయడం వలన సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పుష్కలంగా పండి దేశం సుభిక్షంగా ఉంటుందని ఆర్య ప్రతినిధి సభ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు విఠల్‌రావు ఆర్య అన్నారు. సమాజ్ ముఖ్యంగా వాయు, జల కాలుష్య నివారణకు దోహదపడుతుందని యజ్ఞం చేయడం వలన అన్ని విధాల దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. శ్రావణవేద ప్రచారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్యసమాజ మందిరంలో 3 రోజులపాటు జరిగిన శ్రావణ మహాయజ్ఞం వేద ప్రచారకులు పండిట్ ప్రియదత్ శాస్త్రి మంత్రోచ్చరణాలతో 3 గంటల పాటు నిర్వహించారు. అనం తరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ పట్టణ అధ్యక్షులు విజయకుమార్, సరోదే మంత్రి నాగమ్మ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. రాంకిషన్, ఎస్పి వెంకటేశ్వర్లు, డా. గీత విశ్వనాథ్,ప్రధానోపాధ్యాయులు కె.నారాయణ,ఓంప్రకాష్, ఆత్మరాం,ఎడికె తో పాటు పాల్గొన్నారు.

## ఓటరు ఐడి కార్డు తప్పులను సరిచేసుకోండి

బాలానగర్ మండలంలో ఓటర్ అప్డేట్ ఇంటింటి సర్వే కొనసాగుతుంది: తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్

**బాలానగర్,ఆగష్టు 28 ప్రభాతవార్త :** మండలంలో ఎవరికైనా ఓటరు కార్డులో తప్పులు ఉంటే సరి చేసుకునేందుకు వీలు కల్పించబడుతుందని బాలానగర్ మండల తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టు సర్వేలో భాగంగా కార్డులో ఏవైనా సవరణలు చేసుకునేందుకు అంగన్‌వాడిలు ఇంటింటి సర్వే చేపట్టారని వెల్లడించారు. ఈ సర్వేలో ఓటర్ కార్డు ఫోటో అప్డేట్ చేసుకోవడం, జెండర్ అప్డేట్, పేర్లు తప్పుగా నమోదు చేయబడి ఉంటే అవి కూడా ఈ ఇంటింటి సర్వేలో సరి చేసుకోవచ్చని వివరించారు. అలాగే ఓటరు లిస్టును పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఏ ఒక్క ఫ్యామిలీ మెంబర్ ఇతర వార్డులో ఉండకుండా అందరికి ఒకే వార్డులో ఉండే విధంగా ఆదేశాలు ఉన్నాయని అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

## విద్యుత్ పోరాట అమరులకు ఘన నివాళ్లు



నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

**కొత్తకోట ఆగష్టు 28 ప్రభాతవార్త :** మదనాపురం మండలంలో విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ విష్ణువర్ధన్ రెడ్డి బాలస్వామి లకు సిపిఎం ఆధ్వర్యంలో జోహర్లు అర్పిస్తూ వాళ్ల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెంకట్ రాములు మాట్లాడుతూ ఆగష్టు 28, 2000 సంవత్సరం నాడు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డును బాసిర్బగ్‌లో పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని చెప్పి వామపక్ష పార్టీలు చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా ప్రజా పోరాటంపై లాఠీచార్జి లబ్బర్ బుల్లెటు భాషపు వాయువు గుండ్లను ఉపయోగించి వేలాదిమంది కార్యకర్తలకు దెబ్బలు తగిలాయి కాళ్లు చేతులు ఇరిగినవాళ్లు లెక్కలేనంతమంది ఉన్నారని అన్నారు. ఇంతటి దుర్మార్గానికి వడిగట్టినందుకు అధికారాన్ని కోల్పోయిందని ఆ పోరాట ఫలితంగా నేటికి ఈ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచాలంటే పాలకవర్గానికి ధైర్యం లేదు ఆ పోరాట ఆ ఫలితమే నేటి ఉచిత విద్యుత్ కూడా వీరుల త్యాగం ఎప్పటికి వృధా కావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కే చెన్నయ్య, సి ప్రసాద్, కే వెంకటేష్, సత్యనారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే మెఘారెడ్డి చేయూత

**పెబ్బేర్ ఆగష్టు 28 ప్రభాతవార్త :** పెబ్బేర్ మండలం షాగాపురం గ్రామంలో బొడ్డుపల్లి స్వప్న దహన సంస్కారాల ఖర్చు నిమిత్తం 5000/- రూ పంపించిన మన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శాఖాపురం గ్రామంలో బొడ్డుపల్లి స్వప్న మరణించిన విషయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పందించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి దహన సంస్కారాల ఖర్చు నిమిత్తం 5000 రూపాయలను గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా వారి కుటుంబానికి అందజేయాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట తిరుపతయ్య, కావాలి గోవిందు, గొల్ల రామకృష్ణ, కుమ్మరి వెంకటేష్ గొల్ల సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వృత్తుల కెల్లా వైద్య వృత్తి పవిత్రమైనది

-ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



శోభ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగష్టు28 ప్రభాతవార్త:** ప్రాణపాయస్థితిలో ఉన్న వ్యక్తిని రక్షించేది వైద్యుడని, అటువంటి వైద్యుడిని ప్రతి ఒక్కరు దేవునితో కొలుస్తారని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శోభ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణం పోసే వాడు దేవుడైతే ప్రాణాన్ని నిలబెట్టే వారు వైద్యులు, వైద్యులను దేవునితో సమానంగా పూజిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేదలకు తక్కువ ఫీజుతో మెరుగైన వైద్య సేవలందించే దిశగా కృషి చేయాలని గైనకాలజిస్ట్ డాక్టర్ శోభకు సూచించారు. పేరుడబ్బు కోసం కాకుండా నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించి మంచి వైద్యురాలిగా గుర్తింపు పొందాలని కోరారు. అంతకు ముందు ఆసుపత్రి నిర్వాహకులు ఎమ్మిరెడ్డి లక్ష్మి నిరంజన్‌రెడ్డి, డాక్టర్‌శోభారాణిలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, తీగల సునేంద్ర, బచ్చన్నయాదవ్, సుల్తాన్, కాంగ్రెస్ నాయకులు కొండ నాగేష్, పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**గోపాల్ పేట ఆగష్టు28 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండల కేంద్రంలో బుధవారం ఉదయం పది గంటల సమయంలో గోపాల్‌పేట గ్రామానికి చెందిన గొల్లపుల్లయ్య అను వ్యక్తి అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలింపు చేస్తుండగా గోపాల్ పేట మండల పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

## గ్రామీణ జానపద కళలను పోషిద్దాం

**అయిజ ఆగష్టు 28 ప్రభాతవార్త:** గ్రామాలలో జానపద కళలను పోషిద్దామని జిల్లా జానపద కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్ ఆచారి, సంకాపురం తిమ్మప్పలు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా సంకాపురం గ్రామంలో జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలిపారు. బస్సు, రైళ్ళలో ప్రయాణించడానికి రాయితీపై అవకాశం కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలకే కళాకారులకు పింఛన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జానపద కళాకార సంఘం సంయుక్త కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి రాజు, ఐజ, వడ్డేపల్లి, రాజోలి మండల అధ్యక్షులు గోవింద గౌడ్, వెంకటేష్ యాదవ్, వెంకట్రాములు, కళాకారులు నరసింహాచారి, ఉరుకుంద, లక్ష్మీకాంతం, ఇందువాసి ఆంజనేయులు, ఓంకార్, వసురప్ప, ఉత్తనూరి, హరి, అల్లం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు ఏర్పాటు చేయాలని సంతకాల సేకరణ

**నారాయణపేట టౌన్,ఆగష్టు 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణీకులకు సరిపడా బస్సులను ఏర్పాటు చేసి, తగిన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రయాణీకులకు సరిపడా బస్సులు లేని కారణంగా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రయాణీకులకు సరిపడా బస్సులుఏర్పాటు చేసి తగిన సిబ్బందిని నియమించాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

## ఉపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు

**మక్తల్,ఆగష్టు28 ప్రభాతవార్త:** మండలంలోని కాచ్‌వార్ ప్రాథమికోన్నత పాఠశాలలో గత 12 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జి. లక్ష్మణ్ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో జక్లేర్‌కు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో బుధవారం ఆయనకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామప్రజలు ఆత్మీయవీడ్కోలు పలికారు. పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయురాలు అనిత, అంగన్‌వాడి టీచర్లు నవీనలక్ష్మి, వంటసిబ్బంది, ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది వెంకటేశ్వరమ్మ, నవీన, విద్యార్థులు పాల్గొన్నారు.

## పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**మూసాపేట, ఆగష్టు 28 ప్రభాతవార్త :** మూసాపేట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసినశాంతి సమావేశం కార్యక్రమంలో మూసాపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పి. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే నెలలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాల ప్రతిష్టాపన, నిమజ్జనం సందర్భంగా శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు వినాయకుల మండపాల నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ప్రతిరోజు పోలీసుల నిఘా ఉంటుందని ఏమైనా సమస్యలు ఏర్పడితే డయల్ 100కుకాల్ చేయాలని సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. డిజెలకు ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. ఏమైనాఅవాంఛనీయ సంఘటన జరిగిన వినాయక కమిటి వారే పూర్తి బాధ్యత వహించాలని చట్టాన్ని ఉల్లంఘించి డిజెలు పెడితే డిజె వాహనదారులపై, నిర్వాహకులపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మూసాపేట మస్జిద్ కమిటి సభ్యులు అబ్దుల్ ఖాదర్, మూసాపేట మాజీ ఉపసర్పంచ్ కలీం, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు కృష్ణ, రవి, జాంగిర్ బాబా, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## క్రీడలకు ఎప్పటికి ప్రోత్సాహం అందిస్తా

■ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్, ఆగష్టు 28 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గంలో క్రీడలకు, క్రీడాకారులకు తన ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని, ఈ ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని విజయాలు సాధించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణంలోని మిని క్రీడా మైదానంలో ద్రోణాచార్య స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమి ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జి. బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటిసి జి.లక్ష్మారెడ్డి, గవినోళ్ల గోపాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, రాకేష్‌శర్మ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



సదగోడులో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

**ఉప్పునుంతల, ఆగష్టు 28 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో బుధవారం ఘనంగా పోచమ్మ బోనాలు జరిగాయి. మొదటగా ఆర్యవైశ్యులు బోనాల ఊరేగింపుతో వెళ్లి బొడ్రాయిచుట్టు తిరుగుతూప్రదక్షిణలు చేశారు. అనంతరం పోచమ్మ వద్దఉన్న పోచమ్మగుడిలో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఇతర కులాలకు చెందినబోనాలుభారీ ఊరేగింపుతో కోటా బురుజు, బొడ్రాయి చుట్టూ తిరుగుతూ ప్రదక్షిణలు చేసి పోచమ్మగుడి వద్ద నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలోగ్రామపెద్దలు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని సదగోడు గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు ఊరేగింపుతో భారీ సంఖ్యలో మహిళలు పోచమ్మ వద్దకు వెళ్లి నైవేద్యాలు సమర్పించారు.

## పామాపురంలో విగ్రహాల ప్రతిష్ట పూజలు

**కొత్తకోట ఆగష్టు 28 ప్రభాతవార్త:** కొత్తకోట మండల పరిధిలో గల పామాపురం గ్రామంలో బుధవారం రామాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ట పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన నరసింహస్వామి ,లింగమయ్య, ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాలను ఏర్పాటు సందర్భంగా హోమం కలుశ, యజ్ఞము, అభిషేకం ప్రత్యేకపూజలు చేశారు. మాజీ ఈఎంసి సురేందర్ రెడ్డి దంపతులు, లక్ష్మయ్య, గోవర్ధన్, తెలుగుఖాజా, దంపతులు పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు హరిచంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ బీచ్పల్లి నాయుడు, అయ్యప్ప రెడ్డి, గోవిందు నాయుడు, తిరుపతన్న, కృపాకర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, సర్వారెడ్డి, చంద్రయ్య శెట్టి, కురుమయ్య, కురుమూర్తి, బ్రహ్మయ్య, టకా రెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజు యాదవ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసి బస్సుల సంఖ్యను పెంచాలి



నెహ్రూ చౌరస్తాలో నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

**తెల్కపల్లి, ఆగష్టు 28 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల నాయకులు చిటికెల రామకృష్ణ మాట్లాడుతూ ఆర్టీసి బస్సులు తక్కువ ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే పరిస్థితిని గమనించి కొత్త బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు హుస్సేన్, లక్ష్మయ్య, వెంకటయ్య, శ్రీశైలం, ముత్యాలు పాల్గొన్నారు.

## వైభవంగా బొడ్రాయి, ధ్వజస్తంభం ప్రతిష్టాపన మహోత్సవం

**నారాయణపేట టౌన్, ఆగష్టు 28 ప్రభాతవార్త:** పట్టణంలోని అశోక్‌నగర్ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ధ్వజస్తంభ, శిఖరం, బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం బ్రాహ్మణుల ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చిన్నారెడ్డి, ఆలయ గౌరవ అధ్యక్షులు కుంటిమారి నర్సింలు, మదన్, అశోక్, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## బిసి గురుకులంలో సమస్యలను గుర్తించాం: తహసీల్దార్



బిసి గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, ఆగష్టు28 ప్రభాతవార్త :** జ్యోతిరావుపూలే బిసి గురుకుల పాఠశాలను బుధవారం తహసిల్దార్ కృష్ణయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో తనిఖీలో సమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. గురుకుల పాఠశాలలో 450 మంది విద్యార్థులకు గాను 10 మరుగుదొడ్లు, స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పాఠశాల గదుల్లో సరైన ఫ్యాన్లు కూడా లేవని ఇప్పటివరకు దుప్పట్లు కూడా అందించలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించాలని గురుకుల ఎస్ఓకు సూచించారు. బిసి గురుకులంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసిల్దార్ తెలిపారు. వీరి వెంట ఎంపిఓ అనిల్‌కుమార్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ ఉన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో సంస్మరణ సభ

**ఆత్మకూర్ ఆగష్టు28 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో బుధవారం రాత్రి సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రాజు మాట్లాడుతూ నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయంలో విద్యుత్ , చార్జీల పెంపుదల నిరసిస్తూ కొనసాగిన ఉద్యమంలో అమరులైన నేతల పోరాట ఫలితంగా నేటి వరకు విద్యుత్ చార్జీలు పెంచకపోవడం ప్రజలకు గుర్తించాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న పోరాటాలకు సంఘీభావం తెలుసుతూ ఉద్యమంలోభాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యుత్ అమరవీరుల స్ఫూర్తి ద్వారా ఉద్యమాలు నిర్వహించేందుకు సిపిఎం అగ్రభాగాలు నిరుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇస్మాయిల్ రవి, ప్రకాష్‌తదితరులతోపాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులను కలిసిన ప్రగతి ఫౌండేషన్ చైర్మన్



జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులతో ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆరీపుద్దిన్

**కల్వకుర్తి, ఆగష్టు28 ప్రభాతవార్త:** పలు ప్రజా, మైనార్టీ, స్వచ్ఛంద సేవా సంస్థల సమస్యలపై గౌరవ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్, శహజాదిలను ప్రగతిఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆరీపుద్దిన్ మర్యాద పూర్వకంగా కలిసి ప్రజా సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. కేంద్ర ప్రభుత్వం మైనార్టీ శాఖ ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వివరించారు. దీనికి మైనార్టీ కమిషన్ సభ్యులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## సబ్‌స్టేషన్ నిర్మాణ అసంపూర్తి పనులను వేగవంతం చేయాలి



సబ్‌స్టేషన్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌సీ వెంకటేశ్వర్లు

**వెల్దండ, ఆగష్టు28 ప్రభాతవార్త:** వెల్దండ మండలం పోతేపల్లిలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఎస్‌సీ వెంకటేశ్వర్లు పరిశీలించి ఆదేశించారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయో గల కారణాలను అడిగి తెలుసుకొని వెంటనే పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. అదే విధంగా బొల్లంపల్లిసబ్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏఈ సూర్యనాయక్, విద్యుత్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అక్రమంగా మట్టి తరలింపు

◆ ఫొటోలు తీసేందుకు వెళ్లిన జర్నలిస్టుపై బూతు పురాణం ◆ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



అక్రమంగా మట్టి తరలిస్తున్న దృశ్యం

**బాలానగర్,ఆగస్టు 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నేరళ్లపల్లి గ్రామంలో గల ధరణి కుంట చెరువు నుండి అక్రమంగా మట్టిని ఈదమ్మబాయి గుంత పూడ్చివేతకు తరలిస్తున్న అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. బుధవారం ఇదే విషయంపై స్థానిక జర్నలిస్టు ఫొటోలు, విడియోలు తీసేందుకు ప్రయత్నించగా సదరు వ్యాపారి తన అనుచరులతో మూకుమ్మడిగా బూతుపురాణం మొదలెట్టాడు. కులం పేరుతో సదరు వ్యాపారి దూషించడమే కాకుండా దౌర్జన్యం చేసే ప్రయత్నం చేశారని, దీనిని తప్పించుకుని జర్నలిస్టు బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఇరిగేషన్ ఏఈకి ఫోన్‌లో కంప్లైంట్ చేయడం జరిగిందని వివరించారు. ఈ సంఘటనపై స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించడం జరిగిందని పోలీసులు తెలిపారు. అక్రమ మట్టి వ్యాపారం చేస్తున్నగ్రామానికి చెందిన కాశన్నఅనే వ్యక్తి బరితెగించి ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో కొంత మంది నాయకులకు ముట్టచెప్పాల్సింది ముట్ట జెప్పి తన వ్యాపారాన్ని దౌర్జన్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

◆ అమరచింత ఎస్సై సురేష్



మాట్లాడుతున్న అమరచింత ఎస్సై సురేష్

**అమరచింత ఆగస్టు 28 ప్రభాతవార్త:** విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై, సురేష్ విద్యార్థులను కోరారు. బుధవారం అమరచింత మండలంలోని మస్తీపూర్ గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై,సురేష్ మాట్లాడుతూ, విద్యార్థులు మొబైల్ గేమ్ వల్ల విద్యార్థులు చదువుపై ఏకాగ్రత చూపడం లేదని విద్యార్థులు మొబైల్ యాప్ లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ఆయన విద్యార్థులను కోరారు. విద్యార్థులు జలసాల కోసం ఫోన్ యాప్ ల నుండి లోను తీసుకొని యాప్ లోన్ కట్టకపోవడంతో ఒత్తిడి భరించలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులు లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులను కోరారు.విద్యార్థులు పాఠవాలలో జూనియర్ సీనియర్ అనే భేదం లేకుండా అందరూ సమానంగా ఉండాలని ఆయన అన్నారు. కళాశాల, యూనివర్సిటీలలోచదువుతున్నవిద్యార్థులకు గంజాయి డ్రగ్స మత్తులో పడి విద్యార్థుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని ఆయన అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులను కోరారు. అనంతరం ఎస్సై సురేష్ ను ఉపాధ్యాయ బృందం శాలువతో ఘనంగా సన్మానించారు.

# వికలాంగుల హక్కుల పోరాట సమితి జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న వికలాంగ పోరాట సమితి నాయకులు

**జడ్చర్ల,ఆగస్టు 28 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మహబూబ్ నగర్ జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) జెండాను ఆవిష్కరించారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జడ్చర్ల మండలంలో పండగ వాతావరణంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మందకృష్ణ మాదిగ అనేక ఉద్యమాలు చేసి వికలాంగులకు రూ. 200 పెన్షన్ నుంచి రూ.6 వేల వరకు రూ. 10 వేల నుంచి రూ.15 వేలకు పెంచిఏకైక వ్యక్తి అని కొనియాడారు. వీటితో పాటు వికలాంగులకు అనేక పథకాలు నేడు అమలవుతున్నాయంటే మందకృష్ణ కృషిఎంతో ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో జంగయ్య (ఎమ్మార్పీఎస్), కరాటే శ్రీను, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు పాత్లవత్ బిచ్య నాయక్, ఎడ్ల శ్రీనివాసులు, జిల్లా నాయకులు కావలి రాజశేఖర్,జుర్రు రమేష్,వెంకటయ్య, రాణి, చౌహాన్, దేవయ్య, ఖాదర్, మండల నాయకులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా వినాయక చవితిని జరుపుకుందాం!



శాంతి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట,ఆగస్టు 28 ప్రభాతవార్త:** రాబోయే వినాయక చవితి పండగను శాంతియుతంగా జరుపుకునేందుకు మండల ప్రజలు సహకరించాలని స్థానిక ఎస్సై ఆర్.శేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గ్రామాలలోని వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్‌శాఖ నిబంధనలను తూచ తప్పకుండా పాటించి సంతోషంగా వినాయక చవితిని జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# విఓఏలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విఓఎలు

**నారాయణపేట టౌన్,ఆగస్టు 28 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలో మహిళా స్వయం సహాయక గ్రూపులకు సహాయపడుతున్న విఓఏలకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని కోరుతూ బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం, విఓఎల జిల్లా అధ్యక్షులు భీమేష్, జోషి దర్పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళలను చైతన్యపరుస్తూ వారిని ఆర్థిక లావాదేవీలు స్వతహాగా నడిపేందుకు సాయపడుతూ ఆర్థికంగా,సామాజికంగా మహిళలు ఎదిగేందుకు ఎంతో కృషి చేస్తున్న విఓఎల సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. విఓలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. విఓఎలకు 10 లక్షల ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. నంబర్ 58ను సవరించి విఓఎలకు మూడు నెలల రెన్యువల్ పద్ధతి రద్దు చేయాలన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు ప్రతినెల రెగ్యులర్‌గా విఓఎల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలన్నారు. యూనిఫామ్‌ను కేటాయించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ పార్కు దగ్గర జరుగుతున్న ధర్నా శిబిరానికి హాజరైన నారాయణపేట మండల తహసిల్దార్ అమరేందర్ కృష్ణకు వినతి పత్రం అందజేశారు.ఆ తర్వాత డిఆర్‌డిఎ జిల్లా అధికారి మొగులప్పకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో వివిధ మండలాల విఓఎలు నాయకులు, బాబు, కృష్ణ, పురుషోత్తం, లక్ష్మణ్, బీరప్ప, విజయలక్ష్మి, లక్ష్మి, నాగయ్య పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



లింగాల రామాలయంలో ఉట్లు కొడుతున్న శ్రీకృష్ణులు

**లింగాల,ఆగస్టు 28 ప్రభాతవార్త:** శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలు లింగాల మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ కోదండ రామాలయ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకలు యాదవులు శ్రీ కృష్ణుని వేషధారణలో రామాలయం వద్దకు చేరుకుని కమిటి ఆధ్వర్యంలో స్వామి వారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషధారణలో యాదవులు చాలా ఉత్సాహంగా ఉట్లు కొట్టారు. అంతకు ముందు స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. ఈ శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు తిలకించడానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు పూజారి భాస్కర్, కమిటి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం.. భూత్పూర్ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పరిశీలన..**





కస్తూర్బాలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

( ఇన్‌సెట్లో ) ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. బుధవారం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల శాఖ బృందంతో ఆమె కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ వెనకవైపు ఉన్న స్థలంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఎల్ఆర్ఎస్ బృందంతో ఆమె మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ఎలా చేస్తున్నారని? వారు చేస్తున్న ప్రక్రియను తనిఖీ చేశారు. అంతేకాక ఎల్ఆర్ఎస్‌కై వచ్చిన దరఖాస్తులపై మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్లతో ఆరా తీశారు. రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌లో భాగంగా సర్వే నంబర్, భూమి విస్తీర్ణం, ఇప్పటివరకు ఎంత చేశారు? చేసిన వివరాలు కరెక్ట్ కాదా అన్న వివరాలు తనిఖీ చేశారు. అలాగే నీటి పారుదల శాఖ అధికారులతో ఆమె మాట్లాడుతూ మొత్తం ప్రక్రియ ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనల ప్రకారమే జరగాలని చెప్పారు. భూత్పూర్ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ సవ్యంగా నిర్వహిస్తుండడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. పాఠశాలలోని కిచెన్, స్టోర్‌రూమ్‌ను అలాగే విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, హాస్టల్, టాయిలెట్స్, ఆట స్థలాన్ని అన్నింటిని తనిఖీ చేశారు. అంతేకాక విద్యార్థినులతో ముఖాముచ మాట్లాడి భోజనం ఎలా ఉందని? కెజిబివిలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో రీసైక్లింగ్ ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ తనిఖీ చేసి లీకేజీ అవుతుండగా దాని మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, అంతేకాక విద్యార్థుల ఆరోగ్యం పట్ల, విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయులకు సూచించారు. భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ సురెందర్‌రెడ్డి, భూత్పూర్ తహసిల్దార్ యుపి రాజు, కెజిబివి పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పామిరెడ్డి పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకొని అన్ని విషయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి మృతుని కుటుంబాలను ఆదుకుంటామని వారన్నారు. అదేవిధంగా ఆర్టీసీ కార్పొరేషన్ నుండి ప్రైవేటు బస్సు ఓనర్ ఆదుకుంటామన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుండి ఆదుకుంటామన్నారు. గ్రామ నాయకులు మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దయ్య, శ్రీశైలంలు ప్రభుత్వం నుండి మృతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇప్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# 45గేట్లు ఎత్తి దిగువకు..

(మొదటి పేజీ తరువాయి)

గానూ ప్రస్తుతం 8.512టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. జూరాల ఎడమ కాలువకు 820క్యూసెక్కులు, కుడి కాలువకు 650, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50, కోయిల్‌సాగర్‌కు 630 క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి మొత్తంగా 3,03,824 క్యూసెక్కులు అవట్‌ఫ్లో నమోదైంది.

– నారాయణపూర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. మధ్యాహ్నం 1గంట సమాచారం మేరకు ప్రాజెక్టుకు 1,55,000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదు అయింది. దీంతో ప్రాజెక్టు 30గేట్లు ఎత్తి 178910 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 492.25మీ. 33.313టీఎంసీలు కాగా ప్రస్తుతం 491.16మీటర్లు, 28.49టీఎంసీల నీట్టిమట్టం ఉన్నది.

**శ్రీశైలం డ్యాం 4గేట్లు ఎత్తివేత:** శ్రీశైలం జలాశయం ఏట్లు మళ్లీ తెరుచుకున్నాయి.ఈ ఏడాది ఇది రెండోసారి. బుధవారం సాయంత్రం 6గంటలకు డ్యాం అధికారులు అందించిన సమాచారం మేరకు జలాశయానికి జూరాల గేట్ల ద్వారా 2,85,000,పవర్‌హౌజ్ ద్వారా 25, 585, సుంకేసుల ద్వారా 1,368క్యూసెక్కుల వరద వచ్చి చేరగా మొత్తంగా 3,11,953క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఏపీ పవర్ హౌజ్‌కు 30,826 క్యూసెక్కులు, తెలంగాణ పవర్ హౌజ్‌కు 37822 క్యూసెక్కులు విడుదల చేయగా స్పిల్‌వే ద్వారా 1,12వేల 300 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

# ఎల్ఆర్ఎస్‌పై సర్కార్ ఫోకస్..

(మొదటి పేజీ తరువాయి)

పడాల్సి వస్తున్నది. ఇల్లు కట్టాలంటే కరెంట్, మీటర్, ఇంటి నెంబర్, బ్యాంక్ లోన్లు ఇలా ప్రతి సందర్భం లోనూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్న ది. దీనికారణంగా అటు ఇల్లుకట్టుకోలేక, ఉన్న ప్లాటు ఇతరులకు విక్రయించుకోలేక ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. గత ప్రభుత్వం 2020లో ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) కింద దరఖాస్తులు ఆహ్వానించింది. ఈక్రమంలో ఒక్కో మున్సిపాలిటీ నుంచి వేలల్లో దరఖాస్తులు వచ్చాయి.దీంతో నిర్ణీత ఫీజు తీసుకొని క్రమబద్ధీకరించాలని నిర్ణయం తీసుకున్నది. ఈ పథకానికి సంబంధించి హైకోర్టులో పలు కేసులు దాఖలు అయ్యాయి. దీంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దేవాదాయ, వక్ఫ్,కోర్టు వివాద భూములు మినహా మిగతా అన్ని రకాల లేవుట్లను క్రమబద్ధీకరించనున్నారు. పల్లె పట్టణం అనే తేడా లేకుండా చాలా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి మహబూ బ్‌నగర్‌లోని అన్ని మున్సిపాలిటీల్లో వేలల్లో దరఖాస్తులు వచ్చాయి.

**దరఖాస్తుల ప్రక్రియ ఇలా..**

ఉమ్మడి మహబూబ్‌నరగ్‌లో మొత్తం 194474 దరఖాస్తులు రాగా ఇప్పటికే ఎల్1 స్థాయిలో 39,232 దరఖాస్తులు ఉన్నట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తున్నది. అయితే ఇప్పటికే 1196 దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులు సక్రమంగా ఉన్న వారికి ఫీజు చెల్లించి లే అవుట్ క్రమబద్ధీకరించు కొనేందుకు 4729 దరఖాస్తుదారులకు అవకాశం కల్పించారు. 587 దరఖాస్తులకు సంబంధించి ఫైనల్ అప్రూవల్ అందజేసినట్లు తెలిపారు. ఇలా ఎల్ఆర్ఎస్ పథకం కింద ఇప్పటికి ఉమ్మడి జిల్లాలో రూ. 2కోట్ల 10లక్షల47వేల255 ఆదాయం సమకూరింది. ఒక్కో మున్సిపాలిటీల్లో వేలల్లో ఉన్నాయి. అనుమతులు సరిగా ఉన్న బాధితులకు సర్కారు నిర్ణయంతో వారికి మేలు జరగనున్నది.

# ధ్వజస్తంభం ప్రతిష్టాపనలో పాల్గొన్న చిట్టెం



ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న చిట్టెం అభిజయ్‌రెడ్డి

**నారాయణపేట టౌన్,ఆగస్టు28 ప్రభాతవార్త:** పట్టణంలోని బహార్ పేట్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పెద్ద వినాయకుడు, బొడ్రాయి, ధ్వజస్తంభం, నవగ్రహాలు, ద్వారపాలకులు, శంకు చక్రం నాగులు, బలిపీఠం శ్రీ వెంకటేశ్వర పదాలు వేద పండితుల మంత్రోత్సవాల మధ్య ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతిష్టాపన కార్యక్రమంలో నారాయణపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, పిసిసి కార్యదర్శి అభిజయ్‌రెడ్డితో పాటు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, మహిళలు, భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.

# మేజర్ ధ్యాన్ చంద్ హాకీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తెస్తాం

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యార్థులతో భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి ఆగస్టు 28 ప్రభాతవార్త:** మేజర్ ధ్యాన్ చంద్ హామీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం సాయంత్రం వనపర్తి పట్టణం బాలుర పాఠశాల వద్ద ఉన్న మేజర్ ధ్యాస్ చంద్ క్రీడా భవనాన్ని పరిశీలించారు. భవనం మొత్తం కలియతిరిగి మంచి భవనాన్ని ఎందుకు సద్వినియోగం చేసుకోవడం లేదని యువజన క్రీడా శాఖ అధికారి సుధీర్ రెడ్డిని ప్రశ్నించారు. భవనంలో కొన్ని మౌలిక సదుపాయాలు మరుగుదోడ్లు,బాడ్మింటన్ ఉడన్ కోర్టు, కిటికి అద్దాలు మరమ్మత్తు చేయించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతరం హాకీ అకాడమీ క్రీడాకారులతో కలెక్టర్ ముచ్చటించారు.అకాడమీలో వసతులు ఎలా ఉన్నాయి, భోజనం ఎలా ఉంటది, ప్రతిరోజు పాఠశాలలకు వెళుతున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా సామాగ్రి, ప్రహరీ గోడకు అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని యువజన సంక్షేమ అధికారిని ఆదేశించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ బుధవారం సాయంత్రం చిట్యాల గ్రామ శివారులో ఉన్న జ్యోతి భాపులే బి.సి సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల తరగతి గదులు, ఆహార నిల్వల గదిని సందర్శించారు. ఫుడ్ కమిటీ మానిటర్ లతో మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం పై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తిభోజనం చేశారు.బాగా చదువు కోవాలని,తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.యూత్‌వెల్ఫేర్‌అధికారి సుధీర్‌రెడ్డి ,బి.సి సంక్షేమశాఖఅధికారి సుబ్బారెడ్డి, పిఈటి సురేందర్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గురువయ్య, డిసిఒ మేఘారావు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి

◆ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

**బిజినపల్లి,ఆగస్టు 28 ప్రభాతవార్త:** శాంతిభద్రతలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సూచించారు. బిజినపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని, గ్రామ సందర్శనల వల్ల చిన్న చిన్న తగాదాలను గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లా పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఏ చిన్న సమస్య అయినా లోతుగా అధ్యయనం చేసి సమస్య అయినా లోతుగా అధ్యయనం చేసి సమస్య జఠిలం కాకుండా ప్రాథమిక దశలోనే పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నిగ్రామాలను నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్క గ్రామాన్ని పోలీస్ అధికారులు క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. ప్రతి పోలీసు నేరాలనియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యువత, గ్రామపెద్దలు, మహిళలను సమావేశపర్చి ప్రస్తుతం జరుగుతున్న నేరాలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించాలని, విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాలని, ప్రమాదం సంభవించే ప్రతి ప్రాంతాలకు వెళ్లి ప్రమాద కారణాలను తెలుసుకుని మరలా అటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అసాంఘిక చర్యలపై ఉక్కుపాదం మోపాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్, గుట్కా, గంజాయి నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు జిల్లా ఎస్పీకి సిబ్బంది గాడ్ ఆఫ్ హానర్‌తో ప్రత్యేక ఆహ్వానం పలికారు. సమావేశంలో డీఎస్పీ బి. శ్రీనివాస్, సిఐ కనకయ్యగౌడ్, ఎస్సై నాగశేఖర్‌రెడ్డి, ఏఎస్ఐ సయ్యద్ అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడు అందరివాడు

◆ భగవద్గీత సరైన మార్గాన్ని చూపిస్తుంది
◆ మహబూబ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్



చిన్నారులతో మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 28 ప్రభాతవార్త :** శ్రీకృష్ణ భగవానుడు అందరివాడని, భగవద్గీత మానవుడిని సరైన మార్గంలో నడిపిస్తుందని మహబూబ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ దేవాలయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్ల కార్యక్రమానికి ముఖ్య అతిథిగాపాల్గొని మాట్లాడారు. ప్రతిచిన్నారికి భగవద్గీతలో ఉన్న సారాంశం చెప్పాలన్నారు. అనం తరం చిన్నారులు ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పుల్ల నీరజ విఠల్‌రెడ్డి, చంద్రశేఖర్, కొప్పుల శ్రీనివాస్, శాంతయ్య, విజయరెడ్డి, శైలి యాదవ్, లక్ష్మయ్య, ఇతర పెద్దలు, కాలనీ వాసులు, హిందూ బంధువులుపెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పోలీస్ యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరు విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, వివిధ పార్టీల నాయకులు, విహెచ్‌పి ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.